ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 3 మెదక్
జిల్లాల వార్తలు
సోమవారం 8 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం సా : 6.36 గం.
సహర్ : మంగళవారం ఉ : 4.42 గం.



ఎండ ప్రచండం

ఉమ్మడి జిల్లాకు కొనసాగుతున్న ఆరెంజ్ అలర్ట్

సాధారణం కంటే 5 డిగ్రీలు అధికం

ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత.. 10 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యం

సిద్దిపేటలో 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

మెదక్ జిల్లాలో 43.2 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లాలో 42.5 డిగ్రీలుగా నమోదు

మెదక్, ఏప్రిల్ 7: ఎండలు఼ ఠారెత్తిస్తున్నాయి. ఉదయం 7 గంటల నుంచే సుర్రు మంటున్నది. ఉక్కపోత, వడగాలులకు జనాలు బెంబేలెత్తుతున్నారు. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయని వాతావరణశాఖ పేర్కొంటున్నది. దీంతో, నాలుగు రోజులుగా ఉమ్మడి జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతున్నది. ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి 5 డిగ్రీలు అధికంగా నమోదైతే ఆరెంజ్ అలర్ట్, 6 డిగ్రీలకు పైగా అధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాల్పులు ఉంటే రెడ్అలర్ట్ ప్రకటిస్తారు.



చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌లో ఓ వ్యవసాయ బోరు వద్ద తన కొడుకు దాహార్తిని తీరుస్తున్న తల్లి

రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు

ఉమ్మడి జిల్లాలో ఆదివారం ఈ సీజన్‌లోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట అర్బన్ మండలంలో 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. మెదక్ జిల్లా రేగోడులో 43.2 డిగ్రీలు, కోహీర్ మండలం దిగ్వాల్‌లో 42.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వీటితో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలో పలు మండలాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో, ఆయా మండలాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.

మరికొన్ని రోజులు ఇదే మంట

ఉమ్మడి జిల్లా పరిధిలో మరికొద్ది రోజులు ఎండల తీవ్రత కొనసాగే అవకాశముందని వాతావరణశాఖ వెల్లడించింది. ఎండల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండలో బయటకు వెళ్లకూడదని, మధ్యాహ్నం లోపే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని, తిరిగి సాయంత్రం 4 గంటల తర్వాతే బయటకు వెళ్లాలని సూచిస్తున్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే ఎండ నుంచి రక్షణ కోసం టోపీలు, గొడుగులు ఉపయోగించాలని, కళ్లకు సన్‌గ్లాసెస్ ధరించాలని పేర్కొంటున్నారు.



నిర్మానుష్యంగా మారిన సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా



బోసిపోయిన మెదక్‌లోని ప్రధాన కూడలి

ఉష్ణోగ్రతలు ఇలా..

- సిద్దిపేట జిల్లాలోనే అత్యధికంగా సిద్దిపేట అర్బన్ మండలంలో 43.9 డిగ్రీలు, కుకునూర్‌పల్లిలో 43.7 డిగ్రీలు, చేర్యాలలో 43 డిగ్రీలు, దూళ్మిట్టలో 42.9 డిగ్రీలు, తొగిటలో 42.6 డిగ్రీలు, బెజ్జంకిలో 42 డిగ్రీలు, మద్దూర్‌లో 41.9 డిగ్రీలు, అక్కన్నపేటలో 41.9 డిగ్రీలు, కొమురవెల్లిలో 41.8 డిగ్రీలు, నారాయణ్‌రావుపేటలో 41.5 డిగ్రీలు, కోహెడలో 41.4 డిగ్రీలు, మర్కూక్‌లో 41.2 డిగ్రీలు, కొడ్‌పాకలో 41 డిగ్రీలు, నంగునూర్‌లో 40.9 డిగ్రీలు, దౌల్తాబాద్‌లో 40.8 డిగ్రీలు, చిన్నకోడూరులో 40.8 డిగ్రీలు, గజ్వేల్‌లో 40.7 డిగ్రీలు, దుబ్బాకలో 40.5 డిగ్రీలు, మిర్‌దొడ్డిలో 40.3 డిగ్రీలు, జగదేవ్‌పూర్‌లో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ ప్రకటించింది.
- మెదక్ జిల్లా రేగోడులో 43.2 డిగ్రీలు, వెల్దుర్తిలో 42 డిగ్రీలు, పాపన్నపేటలో 41.1 డిగ్రీలు, కొల్చారంలో 41.1 డిగ్రీలు, చిన్నశంకరంపేటలో 41 డిగ్రీలు, శివ్వంపేటలో 40.8 డిగ్రీలు, రామాయంపేటలో 40.6 డిగ్రీలు, మాసాయిపేటలో 40.5 డిగ్రీలు, మనోహరాబాద్‌లో 40.5 డిగ్రీలు, చిలప్‌చేడ్‌లో 40.4 డిగ్రీలు, చేగుంటలో 40.4 డిగ్రీలు, మెదక్‌లో 40.1 డిగ్రీలు, కౌడిపల్లిలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో 42.5 డిగ్రీలు, కల్హేర్‌లో 42 డిగ్రీలు, జహీరాబాద్‌లో 41.6 డిగ్రీలు, సదాశివపేటలో 41.6 డిగ్రీలు, జిన్నారంలో 41.5 డిగ్రీలు, కందిలో 41.4 డిగ్రీలు, చౌటుకూర్‌లో 41.2 డిగ్రీలు, వట్‌పల్లిలో 41.1 డిగ్రీలు, రామచంద్రాపురంలో 41.1 డిగ్రీలు, నిజాంపేట్‌లో 41 డిగ్రీలు, అమీన్‌పూర్‌లో 40.7 డిగ్రీలు, హత్నూరలో 40.6 డిగ్రీలు, పుల్కల్‌లో 40.5 డిగ్రీలు, నాగల్‌గిద్దలో 40.4 డిగ్రీలు, పటాన్‌చెరులో 40.4 డిగ్రీలు, గుమ్మడిదలలో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జాడలేని కమిటీలు.. కానరాని అభివృద్ధి

- మున్సిపాలిటీల్లో నామమాత్రంగా వార్డు కమిటీలు



సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 7 : పట్టణాల్లో అభివృద్ధి పనులను పారదర్శకంగా చేపట్టాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన వార్డు కమిటీల జాడ కనిపించడం లేదు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలకవర్గ సభ్యులు, అధికారులు, పట్టణవాసులతో కలిపి గతంలో వార్డు కమిటీలను ఏర్పాటు చేశారు. అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన ఆ కమిటీలు.. పాలకవర్గ సభ్యులు, అధికారులు పట్టించుకోకపోవడంతో నామమాత్రంగా మారాయి.

8 మున్సిపాలిటీలు.. 199 వార్డులు

సంగారెడ్డి జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో 199 వార్డులున్నాయి. ఆయా వార్డుల్లో నాలుగు రకాల కమిటీలను మూడు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, అందోల్-జోగిపేట, అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం, నారాయణఖేడ్ మున్సిపాలిటీలున్నాయి. వీటిలో ఒక్కోవార్డులో నాలుగు రకాల కమిటీలను 2021లో ఏర్పాటు చేశారు. మొదటి కమిటీలో స్థానిక యువత, రెండో కమిటీలో మహిళలు, మూడో కమిటీలో రిటైర్డ్ ఉద్యోగులు, నాలుగో కమిటీలో పట్టణ ప్రముఖులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను నియమించారు. ఆరు నెలలకోసారి ఈ కమిటీలు సమావేశమై సమస్యలపై చర్చించి, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని నిర్దేశించారు.

కమిటీలు నిర్వీర్యం

వార్డు కమిటీ సభ్యుల ఆమోదంతోనే వార్డుల్లో పనులు చేయాల్సి ఉంటుంది. ఎక్కడ ఏ అభివృద్ధి పనులు చేయాలన్నా వార్డు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి ఆమోదం పొందాలి. ఇంతటి ప్రాధాన్యమున్న వార్డు కమిటీలను జిల్లాలో ఎక్కడా పట్టింకోవడంలేదనే విమర్శలున్నాయి. ఎనిమిది మున్సిపాలిటీల్లో ఎక్కడా వార్డు కమిటీల సమావేశాలు నిర్వహించడం లేదు. అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం లేదు. వార్డు కమిటీలకు ప్రాధాన్యమిస్తే ప్రజల్లో తమ పట్టు తగ్గుతుందన్న ఉద్దేశంతో పాలకవర్గసభ్యులు ఉద్దేశపూర్వకంగానే వీటిని నిర్వీర్యం చేశారనే ఆరోపణలున్నాయి.



తాటిపల్లి దర్గాలో మంత్రి ప్రార్థనలు

మునిపల్లి మండలం తాటిపల్లి గ్రామంలో ఉన్న యాదుల్లాహుస్సేన్ దర్గాలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం ప్రార్థనలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం స్థానిక నాయకులు దర్గాలో మొక్కుకోగా.. ఈమేరకు మొక్కు చెల్లించుకున్నారు.

-మునిపల్లి

పారిశ్రామికవాడల్లో జల దోపిడీ

- పరిశ్రమల కోసం లక్షల లీటర్లు తోడివేత
- వందల ట్యాంకర్లతో తరలింపు
- ట్యాంకర్ నీటికి రూ. 2 వేలు
- ఆర్వో నీటికి రూ. 4 వేలు
- బొల్లారం, గడ్డపోతరం, కాజీపల్లి పారిశ్రామికవాడల్లో దందా
- పారిశ్రామికవాడకు లేని నీటి కేటాయింపులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు

జిన్నారం, ఏప్రిల్ 7: జిన్నారం మండల పరిధిలోని పారిశ్రామికవాడల్లో నీటి దందా జోరుగా సాగుతున్నది. ఒకవైపు వేసవి తీవ్రతకు భూగర్భ జల మట్టాలు వేగంగా తగ్గుతుండగా.. ఉన్న కొద్ది నీటిని తోడేసి సొమ్ము చేసుకుంటున్నారు. కాజీపల్లి, బొల్లారం, గడ్డపోతారం పారిశ్రామికవాడల్లో ప్రతీరోజు వెయ్యి ట్యాంకర్ల నీరు విక్రయిస్తున్నారంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

నీటి వనరులే కీలకం

ఫార్మా పరిశ్రమలన్నీ నీటి ఆధారంగానే పని చేస్తాయి. వీటికి ప్రతీరోజు లక్షల లీటర్ల నీరు అవసరముంటుంది. మూడున్నర దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో ఫార్మా పరిశ్రలను నెలకొల్పారు. కానీ పరిశ్రమల నీటి అవసరాల కోసం ప్రభుత్వం ఏలాంటి ప్రత్యేక కేటాయింపులు, సరఫరా ఏర్పాట్లు చేపట్టలేదు.

తమ అవసరాల కోసం పరిశ్రమలన్నీ ఎడాపెడా బోర్లు వేసి నీటికి తోడేశాయి. దీనికితోడు పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలతో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. దీంతో, ఇతర ప్రాంతాల నుంచి నీటిని కొనుగోలు చేయక తప్పని పరిస్థితి నెలకొన్నది.

కాసులు కురిపిస్తున్న నీటి వ్యాపారం

నీటి దందా వ్యాపారులు, నాయకులకు కాసులు కురిపిస్తున్నది. నిత్యం వందలాది ట్యాంకర్లలో లక్షల లీటర్ల నీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్ననరు. బొల్లారం, కాజీపల్లి, గడ్డపోతారం గ్రామాల్లో 400 ట్యాంకర్లు ఉన్నాయంటే దందా ఏమేరకు సాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఒక ట్యాంకర్‌లో 20 వేల లీటర్ల నీటికి తరలిస్తారు. ఇందుకు రూ. 2 వేలు వసూలు చేస్తారు. అదే శుద్ధిచేసిన ఆర్వో నీరయితే ట్యాంకర్‌కు రూ. 4 వేలు తీసుకుంటారు. పారిశ్రామికవాడల్లో నాయకులు, వ్యాపారులు పోటాపోటీగా నీటి దందాను కొనసాగిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా బోర్లు వేసి నిరంతరం నీటిని తోడి నిల్వ చేస్తుంటారు. ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు తరలిస్తుంటారు. ఇటీవల నీటిని తీవ్రం కావడంతో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లకు కూడా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు.

అక్రమార్కులపై చర్యలు శూన్యం

భూగర్భ జలాలు అడుగంటడంతో బొల్లారం మున్సిపాలిటీలో నీటి సమస్య తీవ్రమయింది. అధికారుల అవినీతి, నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రవాణా శాఖ అనుమతులు, డ్రైవర్లకు లైసెన్సులు లేకుండానే పట్టపగలు వందలాది ట్యాంకర్లు యథేచ్ఛగా సంచరిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. గతంలో నీటి దందా వ్యవహారంలో వ్యాపారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకుని కేసులు కూడా నమోదయ్యాయి. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పారిశ్రామిక అవసరాల కోసం మిషన్ భగీరథ తరహాలో నీటిని సరఫరా చేస్తేనే నీటి దందాకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.



గడ్డపోతారం ఓ పారిశ్రామికవాడలో పరిశ్రమ వద్ద నిలిపిన ట్యాంకర్లు

ఏసు సన్నిధిలో భక్తులు

మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బిషప్ పద్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం భక్తులు చర్చి ఆవరణలోని చెట్ల కింద సేదదీరారు. అక్కడే వంటలు చేసుకుని విందు చేసుకున్నారు.

-మెదక్ కల్చరల్





భక్తులతో కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం



బోనంతో భక్తులు

చివరివారం కొమురవెల్లి కిటకిట

- అగ్నిగుండాలకు భారీగా తరలివచ్చిన భక్తులు
- మల్లన్న నామస్మరణతో పులకించిన ఆలయ పరిసరాలు

5లో

భక్తి మార్గంతోనే మానసిక ప్రశాంతత

● కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన అర్చకుడు శివలింగ్‌స్వామి

వెల్దుర్తి, ఏప్రిల్ 7 : భక్తి మార్గంతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన అర్చకులు శివలింగ్‌స్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బస్వాపూర్ శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో, భక్తి మార్గంతోనే మోక్ష ప్రాప్తి కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోలపల్లి టోల్‌ప్లాజా వద్ద రూ.1.45 లక్షలు పట్టివేత

పెద్దశంకరంపేట ఏప్రిల్ 7: పెద్దశంకరంపేట మండల పరిధిలోని 161వ జాతీయ రహదారి కోలపల్లి టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మహారాష్ట్ర నుంచి శంకరంపేట మీదుగా వెళ్తున్న అనిల్ కాంబ్లీ వాహనంలో రూ.1.45 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా డబ్బు తీసుకెళుతుండడంతో స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బ్రాహ్మణకుంటలో ఈతకు వెళ్లి బాలుడి మృతి


బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 7: ఈతకు వెళ్లి నీట మునిగి బాలుడు మృతిచెందిన ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో చోటుచేసుకున్నది. జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ప్రకారం.. బీహార్‌కు చెందిన కుశలం మస్తాన్ దంపతులకు ఇద్దరు కుమారులు. బతుకుదెరువు కోసం గతేడాది తీగుల్ గ్రామానికి వచ్చి ఇనుప సామగ్రి దుకాణంలో పనిచేస్తున్నాడు. వారి కుమారులు రేషన్ నాట్, అబీబుల్లా నాట్ మరో బాలుడుతో కలిసి శనివారం దగ్గరలోని బ్రాహ్మణకుంటలోకి స్నానం కోసం వెళ్లారు. ఈ క్రమంలో రేషన్ నాట్(9) బాలుడు కుంటలో మునిగిపోయారు. తల్లిదండ్రులు శనివారం సాయంత్రం కుంటలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం కుంటలో శవం తేలడంతో బయటకు తీశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకొని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లొద్దిచెరువులో ఈతకు వెళ్లి ఒకరి గల్లంతు

దుబ్బాక, ఏప్రిల్ 7: చెరువులో ఈతకు వెళ్లిన ఒకరు నీటమునిగి గల్లంతైన సంఘటన ఆదివారం దుబ్బాక మండల పరిధిలో చోటుచేసుకున్నది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన అన్నల దేవానందం(42) ఆదివారం అప్పనపల్లి శివారులోని లొద్దిచెరువులో ఈతకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో స్థానికులు వెంటనే దుబ్బాక పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో గాలించిన ఆదివారం రాత్రి వరకు ఆచూకీ లభించలేదు.

వరి కుప్పను ఢీకొని ఒకరి మృతి

వెల్దుర్తి, ఏప్రిల్7 : వరి కుప్పను ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని కుకునూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. వెల్దుర్తి మండలంలోని మనేపల్లి గ్రామానికి చెందిన దుబాషి రఘుపతి(45) పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెల్దుర్తికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తున్న క్రమంలో కుకునూర్ గ్రామం వద్ద రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం కుప్పను ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవత తెలిపారు.

బోరు వాహనం కిందపడి ఒకరి మృతి


మడ్ల కుర్మయ్య మృతదేహం

నర్సాపూర్, ఏప్రిల్ 7: నర్సాపూర్ పట్టణంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచుసుకున్నది. ఎస్ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మడ్ల కుర్మయ్య(45) హత్నూర మండలం సుగుణ హేచరీస్ సంస్థలో పని చేస్తూ నర్సాపూర్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం నర్సాపూర్ - సంగారెడ్డి ప్రధాన రహదారిలో హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వద్ద ప్రమాదవశాత్తు బోరు వాహనం వెనక టైర్ల కింద పడడంతో శరీర భాగాలు రెండుగా విడిపోయి మృతిచెందాడు. మృతదేహాన్ని ఎస్ఐ పుష్పరాజ్ పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చిన్నకోడూరు, ఏప్రిల్ 7 : రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని మెట్టుబండల వద్ద ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకోడూరు గ్రామానికి చెందిన బోనాల మహేశ్ బైక్ మీద సిద్దిపేట నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపల్లికి చెందిన పోతుల నాగరాజు బైక్‌పై ఎదురుగా వచ్చి మహేశ్ బైక్‌ను ఢీ కొట్టాడు. కిందపడిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకోని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


చిక్కుడు శ్రీనివాస్(ఫైల్)

మిరుదొడ్డి, ఏప్రిల్ 7 : ఎన్నో ఆశలతో చేస్తున్న వ్యవసాయం అప్పులు మిగల్చడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో చోటుచేసుకున్నది. మిరుదొడ్డి ఎస్ఐ పర్శరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన తొగుట గ్రామానికి చెందిన చిక్కుడు శ్రీనివాస్(45)కు మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో భూమిని కోల్పోయాడు. దీంతో మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో ఐదెకరాల భూమిని కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నాడు. అప్పులు అధికం కావడంతో శనివారం సాయంత్రం పొలం వద్ద పురుగుల మందును తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. స్థానిక రైతులు గమనించి కుటుంబసభ్యులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


సుంచు సుధాకర్ (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 7: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండలం పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశివనూర్ గ్రామానికి చెందిన సుంచు సుధాకర్(30)కు సంవత్సరం క్రితం మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లికి చెందిన ఎలీశాతో వివాహమైంది. ప్రస్తుతం సుధాకర్ భార్య ఎనిమిది నెలల గర్భిణి కాగా పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే సుధాకర్ ఇంట్లో తరచూ గొడవలు కావడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్ఐ బాలరాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చివరివారం

కొమురవెల్లి కిటకిట

● అగ్నిగుండాలకు భారీగా తరలివచ్చిన భక్తులు ● నలుదిక్కులా జనసందోహం
● ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలైన్లు ఫుల్ ● గంటల తరబడి పడిగాపులు ● మల్లన్న నామస్మరణతో పులకింత


ఆలయ రాజగోపుర ఆవరణలో భక్తుల రద్దీ



చేర్యాల, ఏప్రిల్ 7 : కొమురవెల్లి మల్లన్న ఆలయం వేలాదిమంది భక్తులతో జనసంద్రమైంది. మూడునెలల జాతరలో భాగంగా ఆదివారం చివరివారం కావడంతో పాటు అగ్నిగుండాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. భక్తి ప్రపత్తులతో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మదేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లం పానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. దీంతో స్వామివారి దర్శనానికి గంటల తరబడిగా క్యూలైన్లలో పడిగాపులు కాసి తీవ్ర ఇబ్బందులుపడ్డారు. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగుచెట్టు ఆలయ ప్రాంగణాలు రద్దీగా మారాయి. తమ కోరికలు నెరవేర్చమని వేడకుంటూ ఆలయ ప్రాంగణంలోని గంగిరేగుచెట్టుకు భక్తులు ముడుపులు కట్టారు.

ఘనంగా ప్రారంభమైన అగ్నిగుండాలు

జాతరలో చివరిఘట్టమైన అగ్నిగుండాల ఉత్సవాలను ఆలయవర్గాలు ఘనంగా ప్రారంభించాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. వీరశైవుల జగద్గురు వికారాబాదు జిల్లా ఆలంపల్లి మండలం కెంపినమఠాధీశ్వరుడు చెన్నబసవ ప్రభుమహాస్వామి కొమురవెల్లికి చేరుకున్నారు. ఆయన పర్యవేక్షణలో సాయంత్రం ఆలయావరణలోని తోట బావి ప్రాంగణంలో వీరభద్ర పళ్లెరం, భద్రకాళి పూజలు నిర్వహించగా అర్ధరాత్రి అగ్నిగుండాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో బాలాజీశర్మ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు బందోబస్తు నిర్వహించారు.

మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సతీమణి తదితరులు కుటుంబసమేతంగా ఆదివారం మల్లన్నను దర్శించుకున్నారు. అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు.

అపరిశుభ్ర పరిసరాలతో భక్తుల ఇబ్బందులు

ఆలయ రాజగోపురం లోపల ఆవరణలో అపరిశుభ్రతగా ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. క్యూలైన్‌తో పాటు పట్నాలు వేసే ప్రదేశంలో నీరు ప్రవహించింది. పట్నానికి వినియోగించే పంచరంగుల పొడితో చిత్తడిగా మారడంతో క్యూలైన్‌లో నిలుచున్న భక్తులతో పాటు పట్నాలు వేయడానికి కూర్చోలేక భక్తులు తంటాలు పడ్డారు.




పట్నంవేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు, బోనంతో శిగాలూగుతున్న ఆచారవతులు, రాజగోపురం లోపల అపరిశుభ్రంగా పరిసరాలు

మామ, అల్లుడిని ఇంటికి పంపే వరకు వదిలిపెట్టా

● సిద్దిపేటలో సరైనోళ్లు పోటీ చేస్తే సరే..
● లేకపోతే వచ్చే ఎన్నికల్లో నేనే బరిలో నిలబడతా
● గజ్వేల్‌లో నీలం మధుకు ఒక్క ఓటన్న ఎక్కువ రావాలి
● మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు


గజ్వేల్ మదీనా మసీద్‌లో మైనంపల్లి హనుమంతరావు, నీలం మధు, నర్సారెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 7: మామ, అల్లుడిని ఇంటికి పంపించే వరకు వదిలిపెట్టనని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు, డీసీసీ ప్రెసిడెంట్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి మచ్చ లేని వ్యక్తి నీలం మధును మెదక్ ఎంపీగా బరిలో నిలిపామని, ఆయనకు గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్క ఓటు మెజారిటీ అయినా ఇవ్వాలని ప్రజలను కోరారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే కనీసం ప్రజలను కేసీఆర్ కలువడం లేదని మండిపడ్డారు. సిద్దిపేటపై ఫోకస్ పెట్టానని వచ్చే ఎన్నికల్లో అక్కడ సరైన వ్యక్తి దొరికితే సరే కానీ, దొరకని పక్షంలో తానే సిద్దిపేట బరిలో నిలుస్తానని స్పష్టం చేశారు. మామ, అల్లుడిని గద్దె దించే వరకు వదిలిపెట్టబోనన్నారు. తన మైనంపల్లి సోషల్ సర్వీసెస్‌తో పాటు నర్సారెడ్డి త్వరలోనే ట్రస్ట్ ఏర్పాటు చేయబోతున్నారని, రెండు ట్రస్ట్‌లతో ప్రజాసేవ చేస్తామన్నారు. నర్సారెడ్డి కూతురు ఆంక్షారెడ్డిని ఎమ్మెల్యేను చేస్తానని, తిరుమల వెంకన్న అనుమతితో ఈ మాట ఇస్తున్నానన్నారు. అటు అల్లుడిని, ఇటు మామను గద్దె దించుతానని, మహిళల ప్రాతినిధ్య రాజకీయాల్లో అవసరమన్నారు. నీలం మధుకు మంచి మెజారిటీ ఇవ్వాలని కోరారు. ఈ నెల 12 నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని, మల్కాజ్‌గిరితో పాటు మెదక్ సీటుకు తాను ప్రచారం చేస్తానని ఆయన చెప్పారు.

అన్ని వర్గాలకు అండగా ఉంటా : నీలం మధు

మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు పేర్కొన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, మెదక్ ఎమ్మెల్యే సహకారంతో పార్టీ జెండాను ఎగురవేస్తామని నీలం మధు ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, అన్ని వర్గాలకు మంచి చేసేలా కాంగ్రెస్ మేనిఫెస్టో ఉందన్నారు. ఎంపీగా గెలిపిస్తే గజ్వేల్‌కు నిధులు సాధిస్తానని, ఇక్కడి ప్రజలకు అండగా ఉంటానన్నారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ మైనారిటీలకు సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేస్తామని, రూ.4వేల కోట్లతో నిధులను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీకి మైనారిటీలు అండగా ఉండాలని కోరారు. సమావేశంలో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫయీం, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, టీపీసీసీ నాయకులు సుల్తాన్, నాయకులు మజహార్ మాలిక్, ప్రమోద్‌కుమార్, వంటేరు నరేందర్‌రెడ్డి, సర్దార్‌ఖాన్, తదితరులున్నారు. గజ్వేల్ పట్టణంలోని మదీనా మసీద్‌లో తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మైనంపల్లి హనుమంతరావు, నీలం మధు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ కష్టాలు తెచ్చింది

● బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి

నంగునూరు, ఏప్రిల్ 7: గత బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో పోని కరెంట్ ఇప్పుడే ఎందుకు పోతుందని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ వచ్చింది, కరెంట్ కష్టాలు తెచ్చిందని మండిపడ్డారు. ఆదివారం మండలంలోని సిద్దన్నపేటలో ఓ ఫంక్షన్‌హాలులో పార్టీ మండల అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరెంటు కష్టాలు పోవాలంటే మళ్లీ కేసీఆర్ పాలన రావాలన్నారు. ఆచరణ సాధ్యం కానీ హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. నాడు పక్క రాష్ట్రం వాళ్లు తెలంగాణకు అన్యాయం చేస్తే, నేడు సొంత రాష్ట్రం కాంగ్రెస్ నాయకులే అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తనను గెలిపిస్తే రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తడిసిన ఉమా, నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, కోల రమేశ్ గౌడ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకట్రామారెడ్డి

బీజేపీ విధానాలపై త్వరలో సెమినార్ ఏర్పాటు

గజ్వేల్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ప్రొఫెసర్ కోదండరాం

గజ్వేల్, ఏప్రిల్ 7: బీజేపీ విధానాలపై త్వరలోనే సెమినార్ ఏర్పాటు చేద్దామని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. అనారోగ్యానికి గురైన గజ్వేల్ పట్టణానికి చెందిన తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు నిరుడి స్వామిని ఆదివారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో హైదరాబాద్‌లో సెమినార్ ఏర్పాటు చేసి, బీజేపీ విధానాలను ఎండగడదామని ఉద్యోగ, ఉపాధ్యాయులతో అన్నారు. తప్పకుండా రావాలని, ఆ పార్టీ చేపడుతున్న ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆయన వెంట టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు ఏడెల్లి రామచంద్రం, ఉపాధ్యాయ సంఘ నాయకులు బి.రాజులు, సత్తయ్య, మల్లేశం, ఎంఎస్‌పీ నాయకులు మైస రాములు, వార్డు కౌన్సిలర్ బొగ్గుల చందు, సత్యనారాయణ తదితరులున్నారు.


నిరుడి స్వామిని పరామర్శిస్తున్న కోదండరాం

రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

● అన్నివర్గాల అభ్యున్నతికి కేసీఆర్ చేసిన కృషి అమోఘం
● హోంశాఖ మాజీ మంత్రి మహమూద్ అలీ


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మాణిక్‌రావుకు పండు తినిపిస్తున్న మాజీ మంత్రి మహమూద్ అలీ

జహీరాబాద్, ఏప్రిల్ 7 : రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమైతుందని హోంశాఖ మాజీ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీరామారావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందుల కార్యక్రమం ఏర్పాటు జరిగిందన్నారు. అదే ఆనవాయితీని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొనసాగిస్తూ వచ్చారని ఆయన గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం గంగాజమున తహజీబ్ తరహాలో వర్ధిల్లిందని ఆయన చెప్పారు. అన్నివర్గాల అభ్యున్నతికి కేసీఆర్ చేసిన కృషి అమోఘమన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవిప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం, నాయకులు జైపాల్‌రెడ్డి, ఆయా మండలాలకు చెందిన పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరైన ఇఫ్కో డైరెక్టర్

రామాయంపేట, ఏప్రిల్ 7 : రామాయంపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, కౌన్సిలర్లు నాగరాజు, బీఆర్ఎస్ నేతలు హాజరయ్యారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రామాయంపేటలో పట్టుబడిన రేషన్ బియ్యం లారీని చూపుతున్న ఎస్ఐ రంజిత్

రామాయంపేట, ఏప్రిల్ 7 : అక్రమంగా లారీలో తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. హైదరాబాద్ శివారులో లారీలో బియ్యం లోడ్ చేసుకుని గుజరాత్ ప్రాంతానికి తరలిస్తున్నట్లు డ్రైవర్ చెప్పాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల క్రితం పట్టణ శివారులోనూ బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న 16 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే.

ఊడలమర్రి నల్లపోచమ్మతల్లి జాతరకు ఏర్పాట్లు


జంగరాయిలో భారీ ఊడల మర్రిచెట్టు, కొలువైన నల్లపోచమ్మతల్లి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 7: చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి గ్రామంలోని ఊడలమర్రి నల్లపోచమ్మతల్లి జాతరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 200 ఏళ్లకుపైబడిన భారీ ఊడల మర్రిచెట్టు కింద నల్లపోచమ్మ అమ్మవారు, ముత్యాలమ్మ కొలువై ఉన్నారు. ఉగాది సందర్భంగా జంగరాయి ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి జాతర నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు కొనసాగనున్నది.

రేపటి నుంచి మత్తడిపోచమ్మ జాతర

నారాయణఖేడ్, ఏప్రిల్ 7: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో మంగళవారం నుంచి 11వరకు మత్తడి పోచమ్మ, దుర్గాభవానీ అమ్మవార్ల వార్షిక మహోత్సవ జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మంగళవారం ఉగాది పర్వదినం సందర్భంగా అమ్మవారికి బోనాలు, 10న బండ్ల ప్రదర్శన, 11న కుస్తీపోటీలు, అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా మడ్ బాత్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 7: సిద్దిపేట పట్టణంలోని ఆదివారం నిర్వహించిన సామూహిక మట్టి స్నానం(మడ్ బాత్) కార్యక్రమంలో యోగా సాధకులు, ఆరోగ్యాభిలాషులు పాల్గొని మురిసిపోయారు. వ్యాస మహర్షి యోగ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ యోగా, ఉద్యోగ, ఆధ్యాత్మిక, స్వచ్ఛంద, వ్యాపార సంఘాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ బిఎన్.స్వామి మాట్లాడుతూ మట్టి స్నానంతో వివిధ రకాల వ్యాధులను దూరం చేసే అవకాశం ఉందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ యోగా రామిరెడ్డి మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి వస్తున్న సంప్రదాయాలు, జీవన శైలి రోగాలకు దూరంగా ఉంచుతాయన్నారు. ప్రముఖ యోగ శిక్షకుడు తోట సతీష్ ఆధ్వర్యంలో మట్టి లేపనంతో యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, గౌరవాధ్యక్షుడు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మతల్లికి అంగరంగ వైభవంగా బోనాలు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 7 : పెద్దశంకరంపేటలోని దుర్గమ్మతల్లి అమ్మవారికి ఆదివారం సాయంత్రం వైభవంగా బోనాలను సమర్పించారు. సరస్వతీ శిశు మందిర్ నుంచి పట్టణ పురవీధుల గుండా డప్పుచప్పులతో బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణసుభాష్ గౌడ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


పెద్దశంకరంపేటలో దుర్గమ్మతల్లి బోనాల ఊరేగింపు


సిద్దిపేట పట్టణంలో మడ్ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న యోగా సాధకులు


వీరయ్యకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న సంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు

రాష్ట్రంలో మోదీ గాలి తీస్తాం

- హామీలు అమలు చేయని కాంగ్రెస్
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 7: దేశంలో నరేంద్రమోదీ గాలి వీస్తున్నదని బీజేపీ నాయకులు విర్రవీగుతున్నారని, తెలంగాణలో మోదీకి ఒక్క సీటు రాకుండా గాలి తీస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని ఓడించేందుకు విపక్షాలను కలుపుకుని పోయే బాధ్యత కాంగ్రెస్ తీసుకోవాలని, కానీ వారు రావడం లేదన్నారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాల వల్ల దేశవ్యాప్తంగా బీజేపీపై వ్యతిరేకత పెరిగిందని, పదేళ్ల పాలనలో బీజేపీ విధ్వంసం సృష్టించిన దానికి ప్రజలు ఓటుతో స్వస్తి పలకాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే భువనగిరి ఎంపీ స్థానానికి పోటీచేస్తున్న సీపీఎం అభ్యర్థి ఎండీ.జహంగీర్ గెలుపునకు సీపీఎం సంగారెడ్డి జిల్లా కమిటీ తరఫున రూ.లక్ష విరాళం వీరయ్యకు అందజేశారు. అనంతరం పేదల గుడిసెలను తొలగించిన స్థలాలను సందర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు, జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, మాణిక్యం, రాంచందర్, నర్సింహులు, యాదగిరి, యాదవరెడ్డి, ప్రవీణ్, విద్యాసాగర్, కృష్ణ, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ నేతృత్వంలో మరింత అభివృద్ధి

- పార్లమెంట్ ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించండి
- జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్


జహీరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్

జహీరాబాద్, ఏప్రిల్ 7: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చెందుతున్నదని, ఇంకా అభివృద్ధి చెందాలంటే త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని మహీంద్రా కాలనీలో నగర సంకీర్తన, శాంతినగర్, హౌజింగ్‌బోర్డు కాలనీల్లో మార్నింగ్ వాక్, అల్లీపూర్‌లో గల పార్టీ కార్యాలయంలో చేరికలు తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బీజేపీని క్షేత్రస్థాయిలో పటిష్ఠం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సంఘటితమై ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా తాను పోటీలో ఉన్నానని, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఓటర్లందరు తనకు ఓట్లేసి గెలుపునకు దోహదపడాలని ఆయన కోరారు. అందులో భాగంగా మహీంద్రా కాలనీలో నిర్వహించిన నగర సంకీర్తనలో పాల్గొని వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాంతినగర్, హౌజింగ్ బోర్డు తదితర ప్రాంతాల్లో మార్నింగ్‌వాక్ నిర్వహించగా మహిళలు ఆయనకు నుదుటిపై తిలకందిద్ది మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అల్లీపూర్‌లో గల పార్టీ కార్యాలయంలో వివిధపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, నాయకులు ఉమాకాంత్‌పాటిల్, మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, భూమయ్య, శ్రీనివాస్‌గౌడ్, ఆయా మండలాల అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

జిన్నారంలో చేపల మార్కెట్ వినియోగంలోకి వచ్చేనా..?

- గ్రామ శివారులో నిర్మాణం
- సదుపాయాల కొరతతో నిరుపయోగం


జిన్నారం గ్రామ శివారులో నిర్మించిన చేపల మార్కెట్

జిన్నారం, ఏప్రిల్ 7: మండల కేంద్రం జిన్నారం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చేపల మార్కెట్ దూర భారం, సౌకర్యాల కొరతతో వృథాగా మారింది. జిన్నారంలో గతేడాది రూ.10 లక్షల మత్స్యశాఖ నిధులతో 1002 సర్వేనెంబర్‌లో ఫిష్ మార్కెట్‌ను నిర్మించారు. అయితే మార్కెట్‌లో విక్రయాల కోసం ఏర్పాట్లు చేసినా జనావాసాలకు దూరంగా ఉండడం, చేపల విక్రయాలకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో వినియోగంలోకి రాలేదు. ప్రస్తుతం జిన్నారంలో ఉన్న నాన్‌వెజ్ మార్కెట్ వద్దనే చేపల విక్రయాలు జరుగుతున్నాయి. వారాంతపు మార్కెట్ సహా నాన్‌వెజ్ మార్కెట్ జరుగుతున్న ప్రాంతానికి కొత్తగా నిర్మించిన చేపల మార్కెట్ కిలో మీటరు దూరంగా ఉండడంతో నిరుపయోగంగా మారింది. మార్కెట్‌లో 8 వరకు స్టాళ్లు ఏర్పాటు చేసినా నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇక్కడ విక్రయాలు ప్రారంభం కాలేదు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

నారాయణఖేడ్, ఏప్రిల్ 7: నారాయణఖేడ్ మండలం జుజాల్‌పూర్ గ్రామ సమీపంలోని ఖేడ్ పట్టణ శివారులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మృతురాలి వయస్సు 50 నుంచి 60 ఏళ్ల మధ్యలో ఉంటుందన్నారు. వారంరోజులుగా సదరు మహిళ మతి స్థిమితం కోల్పోయి తిరుగుతున్నదని స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి


కాంగ్రెస్‌లో చేరిన ముదిరాజ్ సంఘం సభ్యులు

తూప్రాన్, ఏప్రిల్ 7: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు సాధించడంతో పాటు మెదక్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో శ్రీరామ్‌నగర్ ముదిరాజ్ సంఘం సభ్యులు, నాయకులు పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, నాయకుడు మామిండ్ల కృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల సంక్షేమం: శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం, ఏప్రిల్ 7: కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమం సాధ్యమవుతున్నదని, పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మాదారం గ్రామానికి చెందిన పలువురు యువకులు శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సంగాయిపేటవాసికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉగాది పురస్కారం


బట్టి వెంకటరాజుకు ఉత్తమ ఉగాది పురస్కారం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు విష్ణురాజు

కొల్చారం, ఏప్రిల్ 7: కొల్చారం మండలం సంగాయిపేట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బట్టి వెంకటరాజు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉగాది పురస్కారం అందుకున్నారు. వరంగల్ పట్టణంలో రాష్ట్ర భట్రాజు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పురస్కారాలను అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు విష్ణురాజు చేతులమీదుగా వెంకట్రాజు పురస్కారం అందుకోగా, సంగాయిపేట గ్రామస్థులు అతడిని అభినందించారు.

సమాచారం

ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శిగా శ్రీకాంత్

హవేళిఘణపూర్, ఏప్రిల్ 7: తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శిగా నోముల శ్రీకాంత్ ముదిరాజ్‌ను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మానెగళ్ల రామకిష్టయ్యముదిరాజ్ నియామకపత్రాన్ని అందజేశారు. ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్, జిల్లా ఇన్‌చార్జి పుట్టి అక్షయ్ ముదిరాజ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాళ్లకల్‌లో బీజేపీ ప్రచారం

మనోహరాబాద్: మనోహరాబాద్ మండల కేంద్రంలోని కాళ్లకల్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు నరేందర్‌చారి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు మల్లేష్, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్

చిలప్‌చెడ్: అంబేడ్కర్ ఆదర్శనీయుడని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బండపోతుగల్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే


కొన్యాలలో మృతుని కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునితారెడ్డి

హత్నూర, ఏప్రిల్ 7: మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. హత్నూర మండలం చందాపూర్‌లోని ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో మృతిచెందిన మృతుల కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆదివారం కొన్యాలలో వడ్డేపల్లి రమేష్, చందాపూర్ గ్రామానికి చెందిన చాకలి విష్ణులు ఇటీవల ప్రమాదంలో మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, కుటుంబసభ్యులకు ఉద్యోగం కల్పించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ వావిలాల నరసింహులు, ఎంపీటీసీ విఠల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెండురోజులుగా మిషన్ భగీరథ నీరు బంద్

- ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా


రేగోడులో ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

రేగోడు, ఏప్రిల్ 7: రేగోడు మండల కేంద్రంలో రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గ్రామపంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ల నీరు ఓ కాలనీకి వస్తే.. మరో కాలనీకి అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. కాగా మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ పగిలిపోవడంతోనే నీటి సరఫరా నిలిచిపోయిందని, మరమ్మతులు జరుగుతున్నాయని మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో నీటిని యథావిధిగా సరఫరా చేస్తామన్నారు.

సంగాయిపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కొల్చారం, ఏప్రిల్ 7: మండల పరిధిలోని సంగాయిపేటలో నీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సుల్తానగారి క్రిష్ణ తెలిపారు. వారంరోజులుగా నీళ్లు రాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి కానీ, ఎంపీడీవో కానీ చర్యలు తీసుకుని ప్రజలకు తాగునీరు అందించాలని, లేకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

సామాజిక చైతన్య బైక్ ర్యాలీలను జయప్రదం చేయండి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 7: మహనీయులు అంబేడ్కర్, పూలే జయంతుల సందర్భంగా నిర్వహించే సామాజిక చైతన్య బైక్ ర్యాలీలను జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, పీఎస్ఎం జిల్లా కార్యదర్శి నాగభూషణం, ఆవాజ్ సంఘం జిల్లా నాయకుడు ఖయ్యూం పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 8 నుంచి 13 వరకు జిల్లావ్యాప్తంగా సామాజిక చైతన్య బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, నాయకులు మహేష్, సుధాకర్, దత్తు, బాబురావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

- ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి


రక్తదాతకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఏప్రిల్ 7: లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయమని ఖేడ్ ఎమ్మెల్యే, లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రక్త నిలువలు తగ్గిన క్లిష్ట పరిస్థితులను పురస్కరించుకొని ఆదివారం ప్రాంతీయ ఆస్పత్రిలో లయన్స్‌క్లబ్ రక్తదాన శిబిరం నిర్వహించారు. 100 మంది రక్తదానం చేయగా, ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ రాజ్‌కుమార్, అధ్యక్షుడు సాయికుమార్, సీనియర్ సభ్యులు వెంకట్‌రావు, చంద్రశేఖర్, మహేశ్‌కుమార్, రవికుమార్, డా.నారాయణ పాల్గొన్నారు.

'ప్రజావాణి' రద్దు: కలెక్టర్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 7: కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది పార్లమెంట్ ఎనికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని, ప్రజలు గమనించాలని సూచించారు.

జాతరకు రావాలంటూ ఎమ్మెల్యేకు ఆహ్వానం

జహీరాబాద్, ఏప్రిల్ 7: మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్‌లో ఈనెల 12న నిర్వహించే బీరప్ప జాతరకు హాజరుకావాలని ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు జాతర ఏర్పాట్ల గురించి ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్, ఝరాసంగం మండలాల అధ్యక్షులు తట్టునారాయణ, వెంకటేశం, ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చాప్టా (కే)లో ముగిసిన సప్తాహ


సప్తాహలో పాల్గొన్న భక్తులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 7: నారాయణఖేడ్ మండలం చాప్టా (కే) హన్మాన్ ఆలయంలో వారంరోజులుగా నిర్వహించిన అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. భజన మండలి సభ్యులు భజనలు, కీర్తనలతోపాటు పలు అధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ చేపట్టారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంగమ్మసంగప్ప, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక


అంబేడ్కర్ నూతన కమిటీ బాధ్యులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 7: అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా న్యాయవాది న్యాదెన్‌ద్యాని, అధ్యక్షుడిగా కొటారి నర్సింహులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సిద్ధు, సంజయ్, కార్యదర్శులుగా అనుముల తుకారాం, పుండరీకం, సంజీవ్‌కుమార్, శివాజీ, కమిటీ సభ్యులుగా రాజ్‌కుమార్, లింగయ్య, పొట్టి ప్రవీణ్‌కుమార్, రఘునాథ్, పండరి, సతీష్, శంకర్, గాలి వినోద్, శ్రీనివాస్, సంతోష్, నర్సింహులు, రహీం, పండరిలను ఎన్నుకున్నారు.

ఈసీ అనుమతితో సమస్యలు పరిష్కరించాలి

- పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 7: భారత ఎలక్షన్ కమిషన్ అనుమతితో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ కోరారు. ఆదివారం స్థానిక సంఘ భవనంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల పాలిట శాపంగా మారిన జీవో 317ను రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న డీఏ, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ పార్ట్‌ఫైనల్ లోన్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

చాముండేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

చిలప్‌చెడ్, ఏప్రిల్ 7: మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో గల చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో హైదరాబాద్, మెదక్, బీదర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు పూజారులు ప్రభాకరశర్మ, మోతీలాల్‌శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నల్లవాగులో ఘనంగా హనుమాన్ మహా పడిపూజ


హనుమాన్ పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు

కల్హేర్/సిర్గాపూర్, ఏప్రిల్ 7: సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు(సుల్తానాబాద్)లో శనివారం రాత్రి హనుమాన్ సామూహిక మహా పడిపూజ నిర్వహించారు. గురుస్వామి వినోద్‌గౌడ్, హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన పడిపూజలో హనుమాన్ ఉత్సవ విగ్రహానికి 12 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. సిర్గాపూర్, కల్హేర్, నారాయణఖేడ్, కంగ్టి మండలాలతో పాటు కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన హనుమాన్ దీక్షాదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం


చేగుంటలో ఆదర్శ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట/రేగోడు/చేగుంట, ఏప్రిల్ 7: చిన్నశంకరంపేట మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 6, 7వ తరగతి ప్రవేశ పరీక్షకు 363 మందికి 341 విద్యార్థులు, మధ్యాహ్నం నిర్వహించిన 8వ తరగతి నుంచి 10వ తరగతి పరీక్షకు 88 మందికి 80 మంది విద్యార్థులు హాజరయ్యారని ముఖ్య కార్యనిర్వాహణ అధికారి దీప్లారాథోడ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. అలాగే మండల కేంద్రమైన రేగోడులో తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 6వ తరగతిలో 100 సీట్లకుగాను 128 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 120 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ జయప్రకాష్ తెలిపారు. 7 నుంచి 10వ తరగతికి సంబంధించి 61 మంది దరఖాస్తు చేసుకోగా 56 మంది విద్యార్థులు పరీక్ష రాశారని తెలిపారు. చేగుంట ఆదర్శ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆరో తరగతి పరీక్షలకు 340 మంది విద్యార్థులకు 311 పరీక్షలు రాశారు. మధ్యాహ్నం 2 గంటలకు 7 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 238 విద్యార్థులకు 208 పరీక్షలు రాశారని చేగుంట ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ గౌస్ తెలిపారు.


రేగోడు మోడల్ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


కొల్చారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో కృష్ణ


వెల్దుర్తి: యశ్వంతరావుపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

గిట్టుబాటు ధర కోసమే కొనుగోలు కేంద్రాలు

కొల్చారం, ఏప్రిల్ 7: రైతులకు గిట్టుబాటు ధర అందించడం కోసమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రంగంపేట, కొల్చారం, కొంగోడు సొసైటీ సీఈవోలు నవీన్, కృష్ణ, సాయిరెడ్డి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం కొల్చారం మండలంలోని కొల్చారం, అప్పాజిపల్లి, రంగంపేట, కొంగోడు, నాయిన్‌జలాల్‌పూర్ గ్రామాల్లో సొసైటీల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొల్చారం సొసైటీ చైర్మన్ మనోహర్, డైరెక్టర్లు లంబాడి శ్రీనివాస్, చిన్న రాములు, వెంకటనర్సింహులు, చిన్న రాయన్న, సొబ్బంది బీరప్ప, సిద్ధు, భిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

●**చిన్నశంకరంపేట:** చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గవ్వలపల్లి, అంబాజీపేట, చందాపూర్‌తో పాటు తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సొసైటీ సీఈవోలు ప్రారంభించారు.

●**చిలప్‌చెడ్:** మండలం పరిధిలోని సోమక్కపేట, అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్, జగ్గంపేట, రాందాసుగూడ, గౌతాపూర్, చిలప్‌చెడ్ తదితర గ్రామాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పీఏసీఎస్ సీఈవో పోచయ్య తెలిపారు.

●**వెల్దుర్తి:** మండలంలోని ఆయా గ్రామాల్లో సొసైటీ ద్వారా ఏర్పాటుచేసిన కేంద్రాలను తహసీల్దార్ తులసీరామ్, వ్యవసాయశాఖ ఏవో ఝాన్సీ, సొసైటీ సీఈవో సిద్ధయ్య ప్రారంభించారు.

●**నిజాంపేట:** మండల పరిధిలోని నస్కల్, నగరం, నందగోగుల్, నార్లాపూర్, తిప్పనగుల్ల, చల్మెడ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రామాయంపేట, నిజాంపేట పీఏసీఎస్ సీఈవోలు నర్సింహులు, శోభారాణి ఆదివారం ప్రారంభించారు. అలాగే మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులోని కేంద్రాన్ని సీఈవో శోభారాణి ప్రారంభించారు.

జీడిపల్లిలో 'స్వచ్ఛభారత్'

మనోహరాబాద్, ఏప్రిల్ 7: మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామంలో ఆదివారం 9వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహంచారు. ఇందులో భాగంగా ఎండ తీవ్రత ఎక్కువకావడంతో గ్రామంలో ఉన్న నర్సరీలోని మొక్కలకు నీళ్లు పోసి పిచ్చి మొక్కలు తొలగించారు. గ్రామంలోని యువత స్వచ్ఛందంగా పాల్గొంటూ స్వచ్ఛభారత్ నిర్వహించడం పట్ల పలువురు అభినందించారు.